# తండ్రి గారి సందేశం....



## పునరుత్థానము ప్రకటించునదేమి

**క్రీస్తు నాథుని యందు ప్రియ సహోదరీ సహోదరులారా!**

క్రీస్తు మరణ, భూస్థాపన, పునరుత్థానములు మన విశ్వాసానికి, దేవునితో మనకున్న బాంధవానికి కేంద్రమైయున్నాయి (1 కొరింథీ 15,1-4). దివ్యబలి అర్పించే ప్రతిసారి క్రీస్తు మరణ, భూస్థాపన, పునరుత్థానాలను మనం జ్ఞాపకం చేసుకొంటాం. ఈ సందర్భంలో మనం "పునరుత్థానపు ప్రాధాన్యత ఏమి?" "ఆ గొప్ప సంఘటన ఏమి ప్రకటిస్తుంది?" అనే దాని గురించి ధ్యానిద్దాం.

మొదటిగా, పునరుత్థానం క్రీస్తు దైవత్వాన్ని ప్రకటిస్తుంది. "ఆయన మృతులలో నుండి పునరుత్థానుడై నందున పవిత్ర పరచు ఆత్మ శక్తితో దేవుని కుమారుడుగా నియమింపబడెను" (రోమీ 1,4). పునరుత్థానం యేసు దేవున్ని కుమారుడని నిరూపిస్తుంది. మగ్దలేనే మరియ ద్వారా యేసు ప్రభు ఉత్థానం గురించి సమాచారం అందుకున్న ఇద్దరు అపోస్తలులు సమాధి యొద్దకు పరుగెత్తారు. పేతురు గారితో వచ్చిన యోహాను గారు ఏమి నమ్మాలో ఎరుగకయే ఆయనతో పాటు సమాధిలోకి ప్రవేశించాడు. తరువాత సమాధిలో ఏముందో అతడు చూసాడు. "సీమోను పేతురు వచ్చి, సమాధిలో ప్రవేశించి, అచట పడియున్న నార వస్త్రములను, ఆయన తలకు కట్టిన తుండు గుడ్డను చూచెను. ఆ తుండు గుడ్డ నార వస్త్రములతోపాటు కాక, విడిగ చుట్టి ఉంచబడెను. సమాధి యొద్దకు మొదట వచ్చిన శిష్యుడు కూడ లోనికి వెళ్లి చూచి నమ్మెను" (యోహాను 20,6-8).

విశ్వసింపదగినది యోహాను ఏమి చూసాడు? యేసు మృతదేహాన్ని ఎవరైనా తొందరగా అక్కడ నుండి తరలించి ఉంటే చుట్టిన నారబట్టలను తొలిగించడం, తల రుమాలు మడిచి వెరొకచోట చుట్టి పెట్టటం వంటి పనులు చేయడానికి వీలుగాని, అవసరంగాని ఉండదు. యోహాను చూచింది మానవ సామర్థ్యానికి పొసగనిదే గాని, దైవీకమైన జోక్యానికి అవకాశం లేనిదికాదు. పునరుత్థానాన్ని గూర్చి ప్రభువు తరచుగా పలికిన దానికి అది అనుగుణమైనదిగానే ఉంది. (మత్తయి 16,21; 17,23; 20,19; మార్కు 8,31; 9,31; 10,34; లూకా 9,22; యోహాను 2,19)

క్రీస్తు శిష్యులలో కలిగిన మార్పు పునరుత్థానానికి సాక్ష్యంగా ఉంది. ఆయన బంధింపబడినప్పుడు గాని తీర్పు తీర్చబడేటప్పుడు గాని క్రీస్తు అనుచరుల ప్రవర్తన ఎవ్వరిని ఆకట్టుకోలేదు. ధైర్యమన్నది వారికి లేదు. వారు ప్రాణాలపై తీపితో పారిపోయారు, అపాయానికి బెదిరి దూరంగా తొలగిపోయారు. పేతురైతే యేసును ఎరుగనని పలికాడు. అయినా, పునరుత్థానం తరువాత, వారే యేసును గూర్చి బహిరంగంగాను, ధైర్యంగాను ప్రకటించారు. వారు మారిన తీరు క్రొత్తనిబంధన అంతా మారు మ్రోగుతుంది. శిష్యులు ఏ విషయమై అంత నిశ్చయంగా ఉన్నారు? వారు విశ్వసించిన యేసు ఇప్పుడు సజీవుడు, పునరుత్థానుడు. ఈ నిశ్చయత అపోస్తలుల జీవితాలనే మార్చివేస్తుంది. వారు చెరసాలపాలైనా, కొరడాలతో కొట్టబడినా, రాళ్లతో కొట్టబడినా, చంపబడినా - వారి విశ్వాసం అచంచలమైనది. బలహీనులు, విశ్వాసంలేని వ్యక్తులు, లోకము ఎన్నడూ ఎరుగనంత మహా గొప్ప సంచలనాత్మకమైన వ్యక్తులుగా మారిపోయారు. వారి ఉపదేశము రోమా సామ్రాజ్యాన్నే వణికించింది. పునరుత్థానాన్ని ప్రక్కనపెట్టి శిష్యులలో

కలిగిన మార్పును గూర్చి వివరించడం సాధ్యం కాదు. పునరుత్థానుడైన ప్రభువును వారు చూచారు. అది వారి జీవితాలను శాశ్వతంగా మార్చివేసింది. పునరుత్థానము యేసు దేవుని కుమారుడనే సత్యాన్ని రుజువు చేస్తుంది. ఆ గొప్ప సత్యం నేటికి కూడా ప్రకటింపబడుతుంది.

రెండవది, సిలువపై క్రీస్తు బలిని దేవుడు అంగీకరించినట్టు పునరుత్థానము ప్రకటించింది. క్రైస్తవ్యం సిలువపై కేంద్రీకృతమైఉంది. "సిలువ రక్తముచేత" మనం దేవునితో సమాధానపరచబడ్డాము (ఎఫెసీ 2,16). క్రీస్తు బలివలన దేవుని న్యాయము సంతృప్తి పరచబడింది. దానిని బట్టి మనకు నిత్యజీవమును గూర్చిన నిరీక్షణ కలిగింది. "నేను మీతో ఉన్నప్పుడు, యేసుక్రీస్తును గూర్చియు, అందును ముఖ్యముగా సిలువపై ఉన్న ఆయన మరణమును గూర్చియు, తప్ప మరేమియు తెలిసికొన కూడదని నేను నిశ్చయించుకొంటిని'' (1 కొరింతీ 2,2). యేసు మృతులలో నుండి లేపబడక ఉండినట్లైతే సిలువ మరణం యొక్క ఉద్దేశం నెరవేర్చిందో లేదో మనకు నిశ్చయత కలిగే వీలు ఉండేదికాదు. మన పాపముల కొరకు క్రీస్తు ప్రభువు బలిని దేవుడు అంగీకరించినట్టు ఆయన పునరుత్థానం ప్రకటించింది. దీని ప్రకారం, మనము క్రీస్తు మరణమును బట్టి మాత్రమే గాక, ఆయన పునరుత్థానమువలన రక్షింపబడినవారమై ఉన్నాము. "మన పాపమునకు గాను ఆయన మరణమునకు అప్పగించబడెను. మనలను దేవునకు అంగీకార యోగ్యులముగ ఒనర్చుటకు గాను ఆయన లేవనెత్తబడెను" (రోమీ 4,25).

మూడవది, క్రీస్తు బలిని దేవుడు అంగీకరించిన దానికి ప్రతిఫలముగా వచ్చిన సంతోషకరమైన ఫలితము –నీవు, నేను రక్షించబడగలడమే! పాపము నుండి నూతన జీవము పొంది నడుచుకొనుటకు మనము లేపబడుతామని పునరుత్థానం ప్రకటించింది. క్రీస్తు శరీర పునరుత్థానానికి, నూతన జీవము పొందుటకు లేపబడే ఆత్మ సంబంధమైన మన పునరుత్థానానికి సంబంధమున్నట్టు పరిశుద్ధ గ్రంథం స్పష్టం చేస్తుంది. "కనుక, మన జ్ఞానస్నానము వలన మనము ఆయనతో సమాధి చేయబడి ఆయన మరణమును పాలు పంచుకొంటిమి. ఏలయన, తండ్రి ప్రభావముచే మరణము నుండి క్రీస్తు లేవనెత్తబడినట్లే, మనమును ఒక క్రొత్త జీవితమును గడుపుటకే అట్లు జరిగెను. ఆయన మరణములో మనము ఆయనతో ఏకమై యుందుము. పాపపు శరీరము నశించి మనము ఇక పాపమునకు బానిసలు కాకుండునట్లు, మన పాత స్వభావము ఆయనతో సిలువపై చంపబడినది అని మనకు తెలియును'' (రోమీ 6,4-6). పునీత పౌలు ఎఫెసీయులకు వ్రాస్తూ, ఈ విధంగా అన్నాడు. "అవిధేయత వలన ఆధ్యాత్మికముగ నిర్జీవులమై ఉన్న మనలను, క్రీస్తుతో కూడ ఆయన పునర్జీవులను చేసెను. దేవుని దయవలననే మీరు రక్షింపబడితిరి" (ఎఫెసీ 2,5).

నాలుగవది, ఒకనాడు మన దేహాలు కూడా మృతులలో నుండి లేపబడతాయని యేసు పునరుత్థానం ప్రకటిస్తుంది! చాలా కాలం క్రిందట, "మరణమైన తరువాత నరులు బ్రతుకుదురా?'' అని యోబు ప్రశ్నించాడు (యోబు 14,14). దానికి జవాబు – "అవును–ఎందుకంటే క్రీస్తు లేపబడ్డారు". ఈ సత్యము 1 కొరింతీ 15వ అధ్యాయంలో స్థాపించబడింది. "మరణమున నిద్రించుచున్న వారు లేవనెత్తబడుదురని ధ్రువపరచుటకు క్రీస్తు మృత్యువు నుండి లేవనెత్త బడెననుట సత్యము. ఏలయన, ఒక మనుష్యుని మూలమున మరణము ప్రవేశించినట్లే, మృత్యుల పునరుత్థానము కూడ ఒక మనుష్యుని మూలముననే వచ్చినది. ఆదాము నందు అందుకు ఎట్లు మృతి చెందుతున్నారో అటులనే క్రీస్తునందు అందరు బ్రతికింపబడుదురు. కాని ప్రతి వ్యక్తియు తన క్రమమును బట్టియే. ప్రథమ ఫలము క్రీస్తు, తరువాత ఆయన రాకడ సమయమున ఆయనకు చెందినవారు" (1 కొరింతీ 15,20-25). మరణం అనేది ఇక ఎన్నడూ అడ్డుగోడయై ఉండదు కాని ద్వారమై ఉంటుంది. ఇది నిజమని యేసు పునరుత్థానం మనకు అభయమిస్తుంది.

ఐదవది, దేవుడు తన మాటకు బద్ధుడైయుంటాడని పునరుత్థానం ప్రకటిస్తుంది. "ఈ ఆలయమును మీరు పడగొట్టుడు. నేను దీనిని మూడు రోజులలో లేపుదును." కాని, వాస్తవముగ ఆయన పలికినది తన శరీరము అను ఆలయమును గురించియే (యోహాను 2,19+21). ఈ ప్రవచన వాక్యాన్ని క్రీస్తు ప్రభువునకు విరోధంగా ప్రజలు ధర్మశాస్త్ర బోధకులు వాడుకున్నారు. (మత్తయి 26,61) యేసు సిలువపై ఉన్నప్పుడు, "దేవాలయమును పడగొట్టి మూడు దినములలో కట్టువాడా" అని, అర్థరహితంగా వారు హేళన చేసారు (మత్తయి 27,40). ఈ ప్రవచనపు వాక్యం నెరవేర్పబడింది. ఆయన శరీరము– తన భూసంబంధమైన దేవాలయం – సిలువలో చనిపోయింది, మరియు మూడవ దినమున, ఆ శరీరము లేపబడింది. ప్రభువు అలా జరుగుతుందంటే, అలాగే జరుగుతుంది. యేసు ప్రభు తాను చెప్పిన మాటలను నెరవేర్చువాడు, తన మాటలకు బద్ధుడై ఉండేవాడు. ఆయన నమ్మదగిన వాడు.

ప్రియ సహోదరీ సహోదరులారా, పునరుత్థాన పండుగను జరుపుకోవడానికి సిద్ధపడుతున్న మనమందరం క్రీస్తు పునరుత్థానంలో భాగస్వాములం అవడానికి మనం మన పాపములకు, పాప జీవితానికి సిలువ వేయబడి పాపక్షమాపణము పొంది క్రీస్తుతో తిరిగి లేవనెత్తబడుటకు మనల్ని మనం సిద్ధపడాలి. నూతనమైన జీవాన్ని పొందుకునే భాగ్యాన్ని మనం పొందుకోవాలి. దేవుడు మనలను దీవించును గాక.

**మీకందరికి పునరుత్థాన పండుగ శుభాకాంక్షలు**

**జీవము గలిగిన సజీవ దేవుని జీవస్వరం**
**మనలనందరిని జీవింపజేయును గాక. ఆమెన్.**

క్రీస్తు నందు మీ తండ్రి
**బిషప్ ప్రిన్స్ అంతోని**
ఆదిలాబాద్ గురుపీఠ మేత్రాణులు

## ధ్యాన కేంద్ర నిర్మాణము కొరకు ప్రార్థన

ప్రభువా, నీ నామ మహిమ కొరకు మరియు ఆదిలాబాద్ గురుపీఠంలో సువార్త వ్యాప్తి కొరకు నిర్మించబడుతున్న ధ్యానకేంద్రాన్ని ఆశీర్వదించండి. ఎటువంటి ఆటంకములు లేకుండా దానిని సకాలంలో పూర్తి చేయుటకు తద్వారా మీ సువార్తను ప్రకటించుటకు మాకు అనుగ్రహం దయచేయమని ప్రార్థించుచున్నాము. ఆమెన్.

